# నాలుగు రాళ్లు

తెర ఎత్తబడెను.

"పెళ్లికొడుకు జీతం ఎంతండీ?"

"రెండువేలండి"

"మరి నాతం?"

"నాతం ఏం లేదండి. వట్టి జీతమే"

"సరే ఏ విషయం తరువాత చెబుతాం. వెళ్లిరండి" అన్నారు ఆడపెళ్లివారు మగపెళ్లివారు నిష్క్రమించారు. తెర దించబడెను

తెర ఎత్తబడెను.

"పెళ్లికొడుకు జీతం"

"రెండువేలు"

"పైన ఏమైనా దొరకుతాయా?"

"మావాడు చాలా స్ట్రిక్టు. పైన దొరికినా పుచ్చుకోడు"

"సరే ఏవిషయం తరువాత తెలియజేస్తాం. వెళ్లిరండి"

తెర దించబడెను.

తెర ఎత్తబడెను.

"పెళ్లికొడుకు జీతం?"

"రెండువేలు"

"పైన ఏమైనా నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాడా?"

పెళ్లికొడుకు జోక్యం చేసుకుని

"నాలుగురాళ్లు ఒక పూటకండీ" అన్నాడు.

పెళ్లికూతురు తల్లిదండ్రులు సంతోషించారు. పూటకి నాలుగురాళ్లంటే రోజుకి ఎనిమిది రాళ్లు.

అంటే ముప్పది రోజులకి 240 రాళ్లు.
జీతం 2000. వెరసి 2240 రూపాయలు.
భేష్! పైగా పెళ్లికొడుక్కి అమ్మానాన్నాలేరు.
ఎంతదృష్టం!
తెర దించబడెను.
తెర ఎత్తబడెను.
"ఏవండోయ్ శ్రీవారూ!
మీరు ఏ పూటకాపూట సంపాదిస్తున్న నాలుగురాళ్ల
నాకు ఎప్పటికప్పుడు ఇచ్చేస్తూండండి.
మర్నాడు నేను బ్యాంకులో వేసేస్తుంటాను.
వచ్చే ఏటికి పిల్లాపాపా పుడితే ఆ డబ్బు పనికొస్తుంది"
అంది లిల్లీ.
"అయ్యో అమాయక లిల్లీ!
నేనీ ఉద్యోగంలో చేరిందగ్గర్నుంచి హోటల్లో భోజనం చేస్తున్నాను.
పూటపూటకి నాలుగురాళ్ల చొప్పున
పంటికింద పడుతున్నాయి.
ఏదో ఆ విధంగా నాలుగురాళ్ల సంపాదిస్తున్నాను"
అన్నాడు కొత్త పెళ్లికొడుకు.
తెర దించబడెను.

25-9-1997
ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక